# "గోటు హెల్"

అఖిలాష్ ఇంట్లో ప్రవేశిస్తుండగానే "హాయ్! అన్నయ్యా!" అంటూ అతనికి అపూర్వ ఎదురుపడింది.

"వదిన వంటింట్లో ఉన్నట్టుందన్నయ్యా! ఈ రోజు ఐదు కాకుండానే ఇంటికొచ్చావ్... యేమిటి విశేషం? వదినతో కలిసి ఎటన్నా చెక్కేస్తున్నావా యేమిటి?" అందామె వాళ్ళ అన్నయ్య దృష్టిని తన వైపు మళ్ళించుకోవడానికి ప్రయత్నిస్తూ.

"చెక్కెయ్యడం లేదూ, రక్కెయ్యడం లేదు గానీ మీ వదినగారేం చేస్తున్నదో చూడు!" అసహనంగా అన్నాడతడు.

"యేమిటంత తొందర... ఎదురుగా ఉన్న నన్నసలు పట్టించుకోకుండా వదినెక్కడ? వదినెక్కడ? అని కలవరిస్తున్నావేమిటి? అవిడగార్ని తీసుకొని ఎక్కడికెళ్ళాలిప్పుడు?"

"ఎక్కడికో వెళ్తున్నా... అన్నీ నీకు చెప్పాలా?"

"చెప్పొద్దులే... పెళ్ళైన ఆర్నెల్లకే నీలో ఇంత మార్పు వస్తుందని నేను కలలో కూడా అనుకోలేదన్నయ్యా!"

అలా అంటూనే ఆమె కళ్ళనీళ్ళు తెచ్చుకోవడంతో అతడు ఆశ్చర్యపడ్డాడు.

"ఇంత మాత్రానికే కన్నీళ్ళా? ఇప్పుడు నేనేమన్నానని?" అతని కంఠంలో ఆశ్చర్యంతో పాటు విసుగూ ధ్వనించాయి.

"నువ్వేమి అన్లేదు..." అంటూ ఆమె కళ్ళు తుడుచుకుంటూ తన గదిలోకెళ్ళబోయింది.

"మీరప్పుడే వచ్చేశారా? మీరొస్తారనే మీకోసం టిఫిన్ రెడీ చేస్తున్నా..." అంటూ వంట గదిలోంచి వాళ్ళున్న హాల్లోకొచ్చింది లావణ్య.

"టిఫిన్ తినే టైమ్ ఇప్పుడు లేదుగానీ, నువ్వు త్వరగా తయారవ్వాలి... ఇప్పుడు మనం "ఐమాక్స్" థియేటర్లో ఆడుతున్న "మాట్రిక్స్ రెవల్యూషన్స్" అనే పిక్చర్ చూడటానికి వెళ్తున్నాం. ఇవిగో టికెట్స్ తెచ్చాను. నువ్వు పదినిమిషాల్లో తయారవ్వాలి." అన్నాడతడు జేబులో ఉన్న టికెట్స్ తీసి ఆమెకు చూపిస్తూ.

"పది నిమిషాలేమిటి... మీరు సినిమాకు తీసికెళ్తానంటే ఐదు నిమిషాల్లో తయారవుతాను. ఈలోగా మీరు టిఫిన్ చెయ్యండి" అంటూనే లావణ్య లోపలికెళ్ళిపోయింది. "మీరు 'ఐమాక్స్' థియేటర్ కెళ్తున్నారా? ఐమాక్స్‌లో సినిమా

చూడటం చాలా అద్భుతంగా ఉంటుందని నిన్ననే నా క్లాస్‌మేట్ వనజ చెప్పింది. నన్నూ తీసికెళ్ళవా అన్నయ్యా! ప్లీజ్!" అంది అపూర్వ అతని దగ్గరికొచ్చి అతని చేతులు పట్టుకుంటూ.

"సారీ అపూర్వా! రెండే టికెట్స్ తెచ్చాను. అయినా వారం రోజుల్లో ఎగ్జామ్స్ పెట్టుకొని సినిమాకొస్తాననంటావేమిటి? నీకేమన్నా బుద్ధుందా?"

"బుద్ధున్న వాళ్లెవరూ ఈ దిక్కుమాలిన ఎం.ఏ ఎగ్జామ్స్ కోసం పెద్దగా కష్టపడి చదవక్కర్లేదన్నయ్యా! పరీక్షలు రేపనగా కూడా చదివి ప్యాసుకావచ్చు... అదీ ఫస్ట్ క్లాసులో"

"నీ మొఖంలే... ఇంట్లో కూర్చొని బుద్ధిగా చదువుకో"

"ప్లీజన్నయ్యా! నన్ను కూడా మీతోబాటు ఐమాక్స్ థియేటర్‌కు తీసికెళ్ళవా? "ఐమాక్స్"లో సినిమా చూడాలన్నది నాకో కలగా మారిపోయింది"

"నీకు త్వరలోనే పెళ్ళి చెయ్యబోతున్నాం. బావగారు రెడీగానే ఉన్నారు. నువ్వు ఎం.ఏ పరీక్షలు రాయడమే ఆలస్యం. మీ ఆయనతో వెళ్ళి నీ కలను నిజం చేసుకుందువుగానీ..."

"దిసీజ్ టూమచ్ అన్నయ్యా! నేనిప్పుడే మీతోటే ఐమాక్స్ థియేటర్లో సినిమా చూడాలి. ఇది వరకు నీతో కలిసి నేనెన్ని సినిమాలు చూళ్ళేదూ? ఇప్పుడెందుకిలా నన్ను అవాయిడ్ చేస్తున్నావో నాకర్థం కావడం లేదు"

"దీంట్లో అవాయిడ్ చెయ్యడం ఏమీ లేదు. నాకు ఎగ్జామ్స్ ఉన్నాయి... బాగా చదువుకోవాలి. నన్నెవరూ డిస్టర్బ్ చెయ్యొద్దు అని నువ్వే అన్నావుగా! అందుకే నీ కోసం టికెట్ తీసుకోలేదు. మేం బయటకెళ్ళాక, ఇల్లంతా ప్రశాంతంగా ఉంటుంది. హాయిగా చదువుకో..."

"యేమండీ! డైనింగ్ టేబుల్ మీద టిఫిన్ పెట్టాను... రండి." లోపల్నించి లావణ్య పిలుపు.

"ఇప్పుడు టిఫిన్ తినే టైమ్ లేదు గానీ, నువ్వు త్వరగా వచ్చెయ్" అంటూ అభిలాష్ వాష్ బేసిన్ దగ్గరకెళ్ళి మొఖం కడుక్కోసాగాడు.

"ఇదిగో... వచ్చేస్తున్నా... ఐదు నిమిషాల్లో నేను రెడీ అవుతాను." అంది లావణ్య

ఐదు నిమిషాల్లో వాళ్ళిద్దరూ నీట్‌గా తయారై బయటకెళ్ళిపోతోంటే అపూర్వ వాళ్ళకేసి గుడ్లప్పగించి చూస్తూ ఉండిపోయింది.

*                39                *

అన్నయ్య నిజంగా ఎంత మారిపోయాడో! ఇదివరకెక్కడికెళ్ళినా తనను తీసికెళ్ళేవాడు. ఇంట్లో ఉన్నంతసేపూ అతనికేం కావలసినా "అపూర్వా! అపూర్వా!" అంటూ తననే పిలిచేవాడు. తనకు బుద్ధి తెలిసినప్పట్నించీ, అన్నయ్యే తన ప్రపంచం. చిన్నప్పట్నించీ తనకేది కావాలన్నా అన్నయ్య క్షణాల మీద తెచ్చిచ్చేవాడు. అలాంటి అన్నయ్య ఇవ్వాళ్ళ సినిమాకొస్తానని నోరు తెరచి అడిగినా తీసుకెళ్ళకపోవడం ఆమెకు తలకొట్టేసినట్టుగా ఉంది.

దీనికంతటకీ కారణం లావణ్య అనే ఓ ఆగంతకురాలు అతని జీవితంలోకి ప్రవేశించడమే!

అసలు ఎవరీ లావణ్య?

నిన్న మొన్నటిదాకా అన్నయ్యకు ఆమెవరో తెలీదు. వాళ్ళది లవ్‌మ్యారేజి కాదు.

ఎవరో వచ్చి అమ్మా, నాన్నలకు ఫలానా సంగారెడ్డి అనే ఊర్లో ఓ అమ్మాయుంది. చూడటానికి చాలా అందంగా ఉంటుంది. బి.ఎస్.సి. ప్యాసయింది. వాళ్ళదెంతో మర్యాదస్తుల కుటుంబం. ఆ అమ్మాయైతే మీ అబ్బాయికి చాలా బావుంటుంది." అన్నారు. అంతే! పెళ్ళిచూపులకు వెళ్ళారు – తను కూడా అన్నయ్య వెంట వెళ్ళింది. అమ్మా, నాన్నలు కూడా వచ్చారు.

లావణ్యను మొదటిసారి చూసినపుడు తనకామె పెద్ద అందగత్తెలా అనిపించలేదు. "జస్ట్ ఏవరేజ్ బ్యూటీ" అనిపించింది. అన్నయ్య ఆమెను అస్సలు ఇష్టపడతాడనుకోలేదు. కానీ సర్‌ప్రైజింగ్, అన్నయ్య ఆమెను ఓ.కె చేశాడు.

"ఆమె ఏమంత బావుందని ఓ.కె చేశావన్నయ్యా?" అంది.

"నాదృష్టిలో ఫిజికల్‌గా బావుండటం అంత ముఖ్యం కాదు. ఎందుకో స్పష్టంగా చెప్పలేనుగానీ, ఆమెను చూడగానే, నాకామెమీద చాలా మంచి అభిప్రాయం కల్గింది. దట్సాల్! ఓ.కె అనేశాను" అన్నాడన్నయ్య

"నీది చాలా గొప్ప టేస్టనుకున్నాను... యే అప్సరసనో యే అతిలోక సుందరినో చేసుకుంటావనుకున్నాను. నీది ఇంత పూర్ సెలక్షన్ అవుతుందనుకోలేదు" అంది తను.

"అప్సరస కోసమే, అతిలోకసుందరి కోసమే ఎదురుచూస్తూ కూర్చుంటే ముసలాడినైపోతాను. అప్పుడు అప్సరస దొరికినా నేనీ ముసలాడిని చేసుకోను అంటుంది. ఆ పరిస్థితి తెచ్చుకోవడం కంటే ఇలా సెటిలైపోవడం బెటర్ కదా! అప్పుడే నాకు ముప్పయ్యేళ్ళొచ్చేశాయ్" అన్నాడు.

అమ్మా నాన్నలకు్కూడా ఆ సంబంధం నచ్చింది.

"ఆమెలో యేముందని మీకు నచ్చింది" అని తను అమ్మతో అంటే "వాడింత కాలానికి ఓ అమ్మాయి నచ్చిందని చెప్పాడు. అదే పదివేలనుకున్నాము. పైగా, ఈ సంబంధం వద్దు అనడానికి నాకే కారణమూ కనిపించలేదు. నీ దృష్టిలో ఆ అమ్మాయి పెద్ద అందగత్తె కాకపోవచ్చునేమోగానీ నాకైతే బావుందనే అనిపించింది. చూడగానే ఈమె నాకొడుకును సుఖపెడ్తుందన్న నమ్మకం నాకు కల్గింది" అంది అమ్మ.

నాన్న కూడా అమ్మకు వంత పాడాడు.

కన్ను మూసి తెరిచేలోపలే లావణ్యతో అన్నయ్య పెళ్ళయి పోయింది.

పెళ్లైన మరుక్షణం నుండే అన్నయ్య మారిపోయాడు. ఆమె అన్నయ్య మీద యేం మత్తు మందు చల్లిందో గానీ, అనుక్షణం "లావణ్యా! లావణ్యా!" అంటూ ఆమె చుట్టే తిరగడం మొదలెట్టాడు. చిన్ననాటి నుండి ఉన్న చెల్లెలికన్నా నిన్న మొన్న వచ్చిన భార్యే ఎక్కువన్నట్టుగా అన్నయ్య ప్రవర్తించటాన్ని ఆమె భరించలేకపోతోంది.

వాళ్ళ అమ్మా, నాన్నలది హైదరాబాద్‌కు దగ్గర్లోనే ఉండే ఓ పల్లెటూరు. నాన్న అక్కడే ఉండి వ్యవసాయం చేయిస్తాడు. తననూ, అన్నయ్యనూ చిన్నప్పట్నించీ సిటీలోనే ఉంచి చదివించారు. అన్నయ్య తనకంటె ఆరేడేళ్ళు పెద్ద. ఆయన ఇంజనీరింగ్‌లో పోస్టుగ్రాడ్యుయేషన్ పూర్తి చెయ్యగానే హైదరాబాద్‌లోనే ఉన్న ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజి వాళ్ళు పిలిచి ఉద్యోగం ఇచ్చారు. అప్పట్నించీ తనను చదివించే బాధ్యతను అన్నయ్యే తీసుకున్నాడు. అమ్మా, నాన్నలు అప్పుడప్పుడు వచ్చి పోతుండేవాళ్ళు.

"ఉద్యోగం దొరికింది కదా... పెళ్ళి చేసుకోవడానికెందుకాలస్యం?" అని అన్నయ్యతో అమ్మంటే

"అప్పుడే నా పెండ్లికేం తొందరొచ్చింది... అపూర్వ చదువు కూడా అయిపోనీయండి" అన్నాడన్నయ్య.

తన కోసం పెళ్ళిని వాయిదా వేసుకున్న అన్నయ్య ఇప్పుడిలా మారిపోవడమేమిటి?

తనకు బుద్ధి తెలిసినప్పట్నించీ తన ఆలనా, పాలనా అన్నయ్యే చూశాడు. అనుక్షణం తనను కంటికిరెప్పలా కాపాడాడు. పూర్తిగా తనవాడనుకున్న అన్నయ్య ఇప్పుడు పూర్తిగా పరాయివాడైపోవడాన్ని జీర్ణించుకోలేకపోతున్నది. ఇలా జరగటానికి కారణం తమ మధ్యలోకి ఎక్కణ్నించో అకస్మాత్తుగా ఊడిపడిన ఆ ఆగంతకురాలే!...

ఆ క్షణంలో ఆమెకు లావణ్య ఓ దయ్యంలా, ఓ భూతంలా, ఓ బ్రహ్మరాక్షసిలా కనిపించింది.

*    *    *

"తననొక్కదాన్నే ఇంట్లో వదిలేసి మనిద్దరం ఇలా బయటకు రావడం మీ చెల్లెలికిష్టంలేనట్టుంది" అంది లావణ్య. అతడు నడుపుతున్న స్కూటర్ వెనకాల కూర్చొని అతని నడుము చుట్టూ చెయ్యివేస్తూ.

"దానికి సినిమాల పిచ్చి బాగానే ఉంది. కానీ పరీక్షలు దగ్గర పడ్తున్నాయిగదా..." అన్నాడు అభిలాష్ టాంక్‌బండ్ మీద స్కూటర్‌ను పరిగెత్తిస్తూ.

"అవును... నిన్ననే ఎందుకో సినిమాల ప్రసక్తి వస్తే నా పరీక్షలయిపోయేదాకా నన్నెవరూ సినిమాలకు రమ్మని టెంప్ట్ చెయ్యొద్దు అంది - కానీ మనం సినిమాకెళ్తున్నామనగానే తనకూ రాబుద్ధయింది... చెబితే మీరు మరోలా అర్థం చేసుకుంటారేమోగానీ మీ చెల్లెలు..."

"ఆగిపోయావెందుకు... చెప్పు"

"మీరేమన్నా ఫీలవుతారేమోనని..."

"చెప్పకపోతేనే ఫీలవుతాను. చెప్పు..."

"మీ చెల్లెలు ఒక మాట మీద నిలిచే మనిషి కాదండి. నిన్ననే నన్నెవరు సినిమాలకు పిలవొద్దని చెప్పిందా... ఈ రోజేమో మీరు తనకు టికెట్ తేలేదని బోల్డు బాధపడిపోతున్నది"

"యేం బాధపడదు. మనముందు అలా బిహేవ్ చేస్తుందిగానీ, ఇప్పుడంతా మరచిపోయి చదువులో మునిగిపోయుంటుంది"

"యేమోనండి! ఆమె కొన్నిసార్లు చాలా విచిత్రంగా ప్రవర్తిస్తుంటుంది. ఆమెతో ఎలా ఉండాలో నాకర్థంకావడం లేదు"

"అంటే?"

"ఒక్కొక్కసారి చాలా కలుపుగోలుగా, ప్రేమగా ఉంటుంది. "వదినా! వదినా" అంటూ చాలా ఆత్మీయంగా నాచుట్టు తిరుగుతుంది. ఆమె అలా ఉన్నప్పుడు నాక్కూడా ఆమె నా తోబుట్టువులాంటిదనిపిస్తుంది. కానీ, ఆమెతో ప్రాబ్లెమ్ యేమిటంటే, ఎప్పుడు అలాగే ఉండదు. ఒట్టి పుణ్యానికే ఒకలా అన్నమాటను ఇంకోలా అర్థం చేసుకొని హర్టవుతుంది. నోటికొచ్చినట్టు మాట్లాడి మనల్ని హర్ట్ చేస్తుంది. ప్రేమతో అన్న

మాటకూడా పెడర్థాలు తీస్తుంది. నేనేదో పల్లెటూరిదాన్నన్నట్టుగా, చదువు రానిదాన్నన్నట్టుగా, సభ్యతా సంస్కారాలు తెలియని దాన్నన్నట్టుగా, తనేమో పెద్ద సిటీలో ఉంటున్నదాన్నన్నట్టుగా, సభ్యతా సంస్కారాలు తెలిసినదాన్నన్నట్టుగా ప్రవర్తిస్తుంటుంది. ఆమెనెలా అర్థం చేసుకోవాలో నాకర్థం కావడంలేదు."

"దీంట్లో అంత అర్థంకానిదేమీ లేదులే... దానితో నువ్వు మామూలుగానే ఉండు... ఇంకో నెలరోజుల్లో దాని పెళ్ళయిపోతుంది - మామేనత్త కొడుకు అనురాగ్ దీన్ని చేసుకోవడానికి రెడీగా ఉన్నాడు. అది ఎం.ఏ పరీక్షలు రాయగానే దాని పెళ్ళికి ముహూర్తం పెట్టేస్తాం... పెళ్ళయితే అది చాలా మారిపోతుందిలే."

"మారితే చాలా సంతోషమే."

"ఈరోజు నేనే చిన్న పొరపాటు చేశానేమో"

"యేం చేశారు?"

"దానిక్కూడా ఓ టికెట్ తెస్తే పోయేది. ఐమాక్స్ థియేటర్లో మనమోసారి పిక్చర్ చూద్దాం అన్నయ్యా" అని చాలా సార్లంది. నాకే వీలుకాలేదు."

"ఆమెక్కూడా ఓ టికెట్ తీసుకురాలేదని ఇప్పుడు బాధపడ్తున్నారా?"

"అవును... ఈ రోజది కొంచెం ఎక్కువగానే హర్టయినట్టుంది."

"ఆమె హర్టయ్యిందని మీరు బాధపడ్తున్నారా? అయినా ఈ ఒక్క స్కూటర్ మీద ముగ్గురం ఎలా వెళ్ళే వాళ్ళం?"

"ఆటోలో వెళ్ళే వాళ్ళం"

"ఓహో! అలాగా..." అంటూనే ఆమె అతని నడుము చుట్టూ వేసిన తన కుడిచేతిని తీసేసుకొని అతనికి కొంచెం యెడంగా జరిగి కూర్చుంది.

ఎర్రగా మారిపోయి హుస్సేన్‌సాగర్‌లోకి కృంగిపోతున్న సూర్యుడి అరుణారుణ కాంతులు, మారిపోతున్న ఆమె ముఖకవళికల్ని స్పష్టంగా చూపించలేక పోయాయి.

* * *

వాళ్ళిద్దరూ సినిమా చూసి, ఓ హోటళ్ళో భోజనం చేసి, ఇంటికొచ్చేటప్పటికి రాత్రి పదిన్నరయ్యింది.

రెండు మూడు సార్లు కాలింగ్ బెల్ మోగాక, అపూర్వ వచ్చి తలుపు తెరిచింది.

వాళ్ళు బయటకు వెళ్తున్నప్పటికీ, ఇప్పటికీ ఆమె రూపంలో వచ్చిన మార్పు వాళ్ళను ఆశ్చర్యపరిచింది.

ఆమె తలంతా చిందరవందరగా మారిపోయింది. ఎర్రటిజీరలతో కళ్ళు ఉబ్బిఉన్నాయి. మొఖమంతా జేవురించి, కళావిహీనంగా మారిపోయింది.

ఆమె తలుపులు తెరిచేసి, వెంటనే తన గదిలోకెళ్ళిపోయి పడుకుంది.

"నువ్వప్పుడే పడుకున్నావా? చదువుకుంటున్నావనుకున్నానే..." అంటూ అభిలాష్ ఆమె పడుకున్న గదిలోకెళ్ళాడు.

ఆమె నిండా బ్లాంకెట్ కప్పుకొని నిశ్శబ్దంగా ఉండిపోయింది.

"యేమైంది అపూర్వా?" అరచినట్టుగా అన్నాడతడు.

"ఏమీ కాలేదు"... అందామె విసుగ్గా

"ఎందుకలా ఉన్నావు?"

"బాగా తలనొప్పిగా ఉంది..."

"ఓ సారిడాన్ టాబ్లెట్ వేసుకోలేకపోయావా?"

"వేసుకున్నాను..."

"తగ్గలేదా?"

"తగ్గలేదు... ఇట్స్ కిల్లింగ్ మీ..."

"డాక్టర్ దగ్గరకు వెళ్దామా?"

"అక్కర్లేదు..."

"ఇంకేదన్నా టాబ్లెట్ తెచ్చివ్వనా?"

"వద్దు... నన్నిలా వదిలేస్తే చాలన్నయ్యా! ప్లీజ్!"

"అన్నం తిన్నావా?"

"అపూర్వ అన్నం తిన్లేదండీ! మనం వెళ్ళేటప్పుడు నేను డైనింగ్ టేబుల్ మీద పెట్టినవన్నీ ఎలా పెట్టిపోయానో అలాగే ఉన్నాయి." అంటూ లావణ్య ఆ గదిలోకొచ్చింది.

"అలాగా! అన్నం తిన్నానని అబద్ధం చెప్పావెందుకు?"

అన్నాడు అభిలాష్ అపూర్వ మొఖం మీద కప్పుకున్న బ్లాంకెట్‌ను తొలగిస్తూ.

"నాకే అన్నమూ వద్దు. నన్నిలా వదిలెయ్యండి... ప్లీజ్!" తన శక్తినంతా కూడదీసుకొని బిగ్గరగా అరిచిందామె.

అకస్మాత్తుగా ఆమె అంత బిగ్గరగా అరవడం వాళ్ళిద్దర్నీ షాక్ చేసింది.

"ఎందుకలా అరుస్తావ్? అర్యూగోయింగ్ మ్యాడ్? నీకేమన్నా పిచ్చెక్కుతోందా?" అరచినట్టుగా అన్నాడు అభిలాష్. అతని కంఠంలో విసుగూ, కోపం ధ్వనించాయి.

"అవును... నాకు పిచ్చెక్కుతోంది. మీరెవరూ ఈ పిచ్చిదాని దగ్గరకు రాకండి. నన్నిలా వదిలేసి వెళ్ళిపోండి. ప్లీజ్ గెటౌట్! గెటౌట్!" అంటూ ఆమె మళ్ళీ బిగ్గరగా అరిచింది.

వాళ్ళిద్దరూ ఒకరి మొఖాలొకరు చూసుకుంటూ ఆ గదిలోంచి బయటకెళ్ళిపోయారు.

* * *

నెలరోజులు గడిచాయి.

అపూర్వ పరీక్షలయిపోగానే ఆమె మేనబావతోటే ఆమె పెళ్ళయిపోయింది.

ఆమె భర్త అనురాగ్ గత సంవత్సరమే ఎం.టెక్ పూర్తి చేసి, అభిలాష్ లాగానే హైదరాబాద్‌లోనే ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజ్‌లో లెక్చరర్‌గా చేరాడు.

అనురాగ్‌కు ముగ్గురు చెల్లెళ్ళు. వాళ్ళూ సిటీలోనే చదువుకుంటూ వాళ్ళన్నయ్య ధగ్గరే ఉంటున్నారు.

కాపురానికొచ్చిన మొదటిరోజే భర్తతో అపూర్వ "ఈ ముగ్గురు శాల్తీలూ ఎప్పుడూ మనతోటే ఉండిపోతారా?" అంది. అతడు ఆమె కంఠంలో ధ్వనించిన వెటకారాన్ని పట్టించుకోకుండా

"అవును... వాళ్ళ పెళ్ళిళ్ళయ్యేదాకా వాళ్ళు మనతోటే ఉంటారు. తప్పదు" అన్నాడు.

"మీకు చెల్లెళ్ళంటే పిచ్చి ప్రేమున్నట్టుందే! మీరో ఆదర్శ అన్నగారన్నమాట"

"ప్రేమకంటె బాధ్యత ఎక్కువంటే కరెక్ట్ అనుకుంటాను"

"రెండూ ఒకటేలెండి" అందామె మొఖం చిట్లిస్తూ.

మరో నెలరోజుల తర్వాత ఓ రోజు అనురాగ్ ఆఫీసు నుండి ఇంటికొస్తూనే అపూర్వను చూసి చాలా ఉత్సాహంగా "మనందరం ఈరోజు సినిమాకెళ్తున్నామోఛ్!" అన్నాడు జేబులోంచి టికెట్లు తీసి చూపెడ్తూ -

"మనందరం అంటే?" అంది అపూర్వ

"మనిద్దరం, ప్లస్ మా ముగ్గురు సిస్టర్స్..." అన్నాడతడు.

"ఓహో! మందకు మందనే తోలుకెళ్తున్నారన్నమాట, నేను రాను... మీరు వెళ్ళొచ్చు..." అంటూనే ఆమె తన గదిలోకెళ్ళిపోయింది.

"మనం యేసినిమాకెళ్తున్నామన్నయ్యా?" అంది అక్కడే ఉన్న అతని అందరికంటె చిన్న చెల్లెలు రమ్య, చాలా సంతోషపడిపోతూ.

"ఇప్పుడే చెబుతా..." అంటూ అతడు అపూర్వ వెళ్ళిన గదిలోకెళ్ళాడు.

"మనం వెళ్తున్నది "ఐమాక్స్" థియేటర్‌కు. ఆ థియేటర్లో సినిమా చూద్దామని నువ్వు చాలాసార్లన్నావుగా... అందుకే ఈరోజు పనిగట్టుకొని ఆ థియేటర్‌కు వెళ్ళి, టికెట్లు తెచ్చాను. త్వరగా తయారవ్వు... వెళ్దాం..."

"నేను రానని చెప్పాను... మీరు వెళ్ళండి"

"ఎందుకు రావు?"

"రాను... అంతే..."

"నువ్వు రాకపోతే మేమూ వెళ్ళం... అసలీ ప్రోగ్రామ్ ఏర్పాటు చేసింది నీకోసమే..."

"పాపం!..."

"నిజం అపూర్వా! నీకోసమే నేనివ్వాళ్ళ మా ప్రిన్స్‌పాల్‌తో చెప్పి కాలేజి నుండి త్వరగా బయల్దేరి, థియేటర్‌కు వెళ్ళి, టికెట్స్ తీసుకొచ్చాను... ముందే నీతో ఎందుకు చెప్పలేదంటే సర్‌ప్రైజ్ చేద్దామని..."

"నన్ను చాలా సర్‌ప్రైజ్ చేశారు... మీరు చేసిన సర్‌ప్రైజ్ నుండి నేనింకా తేరుకోలేదుగానీ మీరు వెళ్ళిరండి..."

"నువ్వు రాకపోతే మేమూ వెళ్ళం"

"ఎందుకు వెళ్ళరు? తప్పకుండా వెళ్తారు. మీ ముగ్గురు ముద్దుల చెల్లెళ్ళను మీ భుజాల మీదకెక్కించుకొని చక్కగా వెళ్ళిరండి. ఆదర్శ అన్నగారని మీకీ సిటీ అంతా ఘనంగా సన్మానం చేస్తుంది."

"నాకే సన్మానాలూ అక్కర్లేదు గానీ నువ్వు త్వరగా తెములు."

"ఎందుకక్కర్లేదు... చెల్లెళ్ళ కోసం ప్రాణమిచ్చే అన్నగారిక్కడ ఉన్నారని లోకమంతా మిమ్మల్ని కీర్తించాలిగదా!"

"పోనీయ్... మనిద్దరమే వెళ్దాం - వస్తావా?"

"రాను - ఆడబిడ్డల ఉసురుపోసుకుంటున్నదని లోకమంతా నన్ను ఆడిపోసుకోవాలనా మీ ప్లాన్?"

"అదేం లేదు - నిన్నెవరూ ఆడిపోసుకోరు - మనిద్దరమే వెళ్దాం. ఇదిగో మిగతా మూడు టిక్కెట్లని చించేస్తున్నాను" అంటూనే అతడు జేబులోంచి మూడు టిక్కెట్లను తీసి, చించేసి, నేలమీద పడేశాడు. "ఇప్పుడన్నా త్వరగా తయారవుతావా?" అన్నాడతడు ఆమెకేసి బతిమాలుతున్నట్టుగా చూస్తూ.

"మీరనవసరంగా ఆ టికెట్లను చించేశారు. నా కోసం మీరు మీ చెల్లెళ్ళ మీది ప్రేమను త్యాగం చెయ్యొద్దు. మీలాంటి ఆదర్శ అన్నయ్య నుండి చెల్లెళ్ళను వేరు చేసేటంత రాక్షసిని కాను నేను"

"ఇంతకూ ఇప్పుడేమంటావు? సినిమాకొస్తావా? రావా?"

"రాను..."

"అంతేనా?"

"అంతే"

"చివరిసారి అడుగుతున్నా... అంతేనా? నీ నిర్ణయం మారదా?"

"అంతే... మారదు..."

"దెన్ యూ గోటు హెల్!" అంటూనే అతడు మిగతా రెండు టికెట్లను కూడా చించేసి ఆమె మీదకు విసిరేసి, ఆ గదిలోంచి విసురుగా బయటకు వెళ్ళిపోయాడు.

– 'స్వాతి' వారపత్రిక, ***23-09-2005***

కథా నిలయం
శ్రీకాకుళం